ఎక్కడికక్కడే నిర్బంధం

ఆశా వర్కర్ల చలో విజయవాడను అడ్డుకున్న పోలీసులు



కొలనుకొండలో పిడికిలెత్తి నినదిస్తున్న ఆశా కార్యకర్త

వేతనాలు పెంచాలని కోరిన ఆశా వర్కర్లపై పోలీసులు జులుం ప్రదర్శించారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని వైద్యఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించాలని ఆశా వర్కర్ల సంఘం పిలుపు ఇవ్వడంతో పోలీసులు నిర్బంధాలకు దిగారు. అడుగులు వేసిన ఆశా వర్కర్లను కొలకనుకొండ వద్ద నిలువరించారు. వివిధ జిల్లాల నుంచి విజయవాడకు వచ్చే కార్యకర్తలను నగరం ప్రవేశ ద్వారాల వద్ద అడ్డుకున్నారు. పోలీసుల కనుసన్నల నుంచి తప్పించుకుని ధర్నాచౌక్‌కు వచ్చిన ఆశాలను అదుపులోకి తీసుకున్నారు. కృష్ణా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఆశా వర్కర్లను కదలనీయకుండా గృహ నిర్బంధం చేశారు. కొందరిని ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు, కల్యాణమండపాలకు తరలించారు. మొత్తంగా ఆశా వర్కర్లు గురువారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు.

- కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్
- తపసిపూడి డీటీసీకి, జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లకు నిరసనకారుల తరలింపు
- బుధవారం రాత్రి నుంచి గృహ నిర్బంధం
- అన్ని నియోజకవర్గాల్లో అరెస్టులు



కొలనుకొండలో..

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : పలు డిమాండ్లతో గురువారం చలో విజయవాడ కార్యక్రమానికి ఆశావర్కర్ల సంఘం పిలుపునిచ్చింది. ఈనెల 11వ తేదీన కలెక్టరేట్ వద్ద జరగనున్న 36 గంటల దీక్షలో పాల్గొంటామని ఆశావర్కర్లు తెలిపారు.

● నియోజకవర్గాల్లో అదుపులోకి..

మచిలీపట్నం నియోజకవర్గం నుంచి చలో విజయవాడకు తరలివెళుతున్న ఆశా వర్కర్లను పోలీసులు ఎక్కడికక్కడే అడ్డుకున్నారు. బుధవారం సాయంత్రమే ఆశావర్కర్ల గృహాల వద్దకు పోలీసులు వెళ్లి చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లవద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు. సీఐటీయూ నాయకులు బూర సుబ్రహ్మణ్యం, సీహెచ్ జయరావులను గృహనిర్బంధం చేశారు. చలో విజయవాడలో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకు వచ్చిన ఆశా వర్కర్లను మచిలీపట్నంలోని డీటీసీకి తరలించారు. మచిలీపట్నం, గూడూరు, పెడన తదితర ప్రాంతాలకు చెందిన ఆశా వర్కర్లు విజయవాడకు వెళుతుంటే వారిని అదుపులోకి తీసుకుని మచిలీపట్నంలోని డీటీసీకి తరలించారు.

● పెనమలూరు నియోజకవర్గంలోని చలో విజయవాడకు తరలివెళుతున్న ఆశా వర్కర్లను చినఓగిరాల వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని ఉయ్యూరు టీటీడీ కల్యాణ మండపం, కాటూరులోని ప్రైవేటు కల్యాణ మండపానికి తరలించారు.

● పెనమలూరులో ఆశావర్కర్లను పోలీసుల అదుపులోకి తీసుకుని పోరంకి ఎల్ఎన్ గార్డెన్స్‌కు తరలిచారు. మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆశావర్కర్ల వద్దకు వెళ్లి సంఘీభావం తెలిపారు.

● అవనిగడ్డ నియోజకవర్గంలో అవనిగడ్డ బస్టాండ్, పులిగడ్డసెంటర్ వద్ద, రహదారుల వెంబడి నిఘా పెట్టారు. విషయం తెలుసుకున్న కొంతమంది ఆశావర్కర్లు బుధవారం మధ్యాహ్నమే విజయవాడకు తరలివెళ్లారు. మిగిలిన వారిని వారి గృహాల నుంచి బయటకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు.

● గుడివాడ నియోజకవర్గంలో రైల్వేస్టేషన్, బస్టాండ్ వద్ద నిఘా ఉంచిన పోలీసులు ఆశావర్కర్లను అదుపులోకి తీసుకుని గుడివాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



ఉయ్యూరు టీటీడీ కల్యాణమండపంలో పోలీసుల నిర్బంధంలో..

● డిమాండ్లు ఇవే..

ఆశావర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలి. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా గుర్తించాలి. ప్రమాద బీమాను రూ.10 లక్షలకు పెంచాలి. పనిభారం తగ్గించాలి. పదవీ విరమణ బెనిఫిట్స్‌గా రూ.5 లక్షలు ఇవ్వాలి. మెటర్నిటీ లీవ్‌లు అమలు చేయాలి. సంక్షేమ పథకాలను కూడా అమలు చేయాలి. ఏఎన్ఎంలు, హెల్త్ సెక్రటరీల నియామకాల్లో ఆశా వర్కర్లకు ప్రాధాన్యత ఇవ్వాలి.



కొలనుకొండలో..

జోగి వారి కుటుంబ పాలన!

పెనమలూరు నియోజకవర్గంలో మంత్రి, ప్రస్తుత వైసీపీ అభ్యర్థి జోగి రమేశ్ కుటుంబపాలన మొదలైంది. మైలవరం, పెడన నియోజకవర్గాల్లో మొదలైన జోగి హవా ప్రస్తుతం పెనమలూరు నియోజకవర్గంలో కొనసాగుతోంది. ఆయన కుమారుడు జోగి రాజీవ్‌కు ఎలాంటి పదవీ లేకున్నా అధికారిక కార్యక్రమాల్లో పెద్దపీట వేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు జోగి రమేశ్ సోదరుడు, తనయులు బుసుక, ఇసుక రవాణాల్లో జోక్యం చేసుకుని సెటిల్‌మెంట్లు చేస్తున్నారన్న విమర్శలు సొంత పార్టీ నాయకుల నుంచే వస్తున్నాయి.

- పెడన, మైలవరం అయిపోయింది
- పెనమలూరులో మొదలైన పెత్తనం
- అధికారిక కార్యక్రమాల్లో కుమారుడి ఫొటోలు
- బుసక, ఇసుక రవాణా సెటిల్‌మెంట్లలో జోక్యం
- భవన నిర్మాణదారులనూ పిండేస్తున్న వైనం

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : పెనమలూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా జోగి రమేశ్‌ను అధిష్ఠానం ప్రకటించింది. ఆ మరుక్షణం నుంచే పెనమలూరుపై పట్టు కోసం జోగి పావులు కదపడం ప్రారంభించారు. ఆయన తనయుడు జోగి రాజీవ్, సోదరుడు రాము ఇతర కుటుంబ సభ్యులు పెనమలూరులో ప్రధాన ఆదాయ వనరులపై దృష్టి సారించారు.

ఆ రెండు నియోజకవర్గాలను పిండేసి..

జోగి రమేశ్ ప్రస్తుతం పెడన నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అక్కడ ఏ చిన్న పని కావాలన్నా జోగి అనుచరులకు మామూళ్లు ముట్టచెప్పుకోవాల్సిందేనన్న ముద్ర పడింది. చెరువుల తవ్వకాలు మొదలు చిన్నచిన్న కాంట్రాక్టుల వరకు అన్నిటా కమీషన్లు గుంజారన్న ఆరోపణలు ఉన్నాయి. జోగి సోదరుడు రాము మైలవరం నియోజకవర్గంలో మట్టి, బూడిద దోపిడీతో కోట్లు వెనుకేశారన్న ఆరోపణలున్నాయి. ఈ విషయాన్ని సాక్షాత్తు వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదే చెప్పడం గమనార్హం. మైలవరంలో తనను సగం ప్రాంతానికే పరిమితం చేశారని మిగిలిన ప్రాంతమంతా జోగి కనుసన్నల్లోనే ఉండేదని వసంత ఆరోపించారు. తాజాగా పెనమలూరుకు జోగి రావడంతోనే వసూళ్ల దందాకు తెరదీశారన్న ఆరోపణలు ఉన్నాయి. బుసక తోలకానికి నెలవారీ మామూళ్లు పెట్టారని ప్రాంతాల వారీగా వసూలు చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి.



అధికారిక కార్యక్రమాల్లో మంత్రి జోగి రమేశ్‌తో ఆయన తనయుడు (వృత్తంలో)

అధికారిక కార్యక్రమాల్లో తనయుడి భజన

పెనమలూరు నియోజకవర్గంలో ఏ అధికారిక కార్యక్రమం నిర్వహించినా వేదికపైన, కార్యక్రమం జరిగే ప్రాంతంలో వేసిన ఫ్లెక్సీల్లో జోగి తనయుడు రాజీవ్ ఫొటో తప్పనిసరిగా ఉండాలన్న ఆదేశాలు ఇప్పటికే అందరికీ వెళ్లాయి. దీంతో ఏ కార్యక్రమం జరిగినా జోగి రాజీవ్ ఫొటో కనిపిస్తోంది. పార్టీ కార్యక్రమాల వరకు సర్దుకుపోతాం కానీ అధికారిక కార్యక్రమాల్లోనూ ఈ ఫొటోలు ఏంటని సొంత పార్టీవారే విమర్శిస్తున్నారు. రాజీవ్‌కు పార్టీలో ఎలాంటి పదవి లేదు. వాస్తవానికి పార్టీ కార్యక్రమాల్లోనూ ఆయన ఫొటో వేయాల్సిన అవసరం లేదు. కానీ ఏకంగా అధికారిక కార్యక్రమాల్లోనూ ఆయన ఫొటోలు దర్శనమిస్తున్నాయి. వైసీపీ యువజన నాయకుడు అన్న హోదాతో ఈ ఫొటోలు వేస్తున్నారు. అధికారిక కార్యక్రమాల్లో తండ్రితోపాటు ఈయన కూడా పాల్గొంటున్నారు. వేదికలు పంచుకుంటున్నారు. జోగి తీరుపై ఎన్నికల్లో గెలవకముందే కుటుంబపాలన తీసుకొచ్చేశాడు. ఇక గెలిస్తే నియోజకవర్గంలో ఏ వైసీపీ నాయకుడినీ బతకనివ్వరన్న ప్రచారం సొంత పార్టీ నాయకుల్లో జరుగుతోంది.

ఆరోపణలివీ..

● వణుకూరు ప్రాంతంలో బుసక తోలకానికి రూ.25 లక్షలు తీసుకున్నారని సొంత పార్టీ నాయకులే చెబుతున్న మాట.

● పెనమలూరు విజయవాడ చెంతనే ఉండటంతో ఇక్కడ భవన నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ జోరుగా సాగుతుంది. ప్రభుత్వం మారుతుందన్న వార్తలతో ఇటీవల ఇక్కడ వెంచర్లు కూడా ఎక్కువగా వస్తున్నాయి. వీరందరి నుంచి నిర్దేశిత మొత్తాన్ని ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వెంచర్ వేస్తే ఎకరాకి రూ.10 లక్షలు, అక్రమ నిర్మాణాల నుంచి ఫ్లోర్‌కు.. అందులో ఉన్న ప్లాట్ల ఆధారంగా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి.

● ఎన్నికల నిధులు మొత్తం నెల.. రెండు నెలల కాలంలో వసూలు చేయడమే లక్ష్యంగా అనుచరులు తమ దందా నడిపిస్తున్నారు. జోగి అనుచరుల దూకుడు చూసి పెనమలూరు నియోజకవర్గ వాసులు బెంబేలెత్తుతున్నారు. ఈయన కన్నా గత ఎమ్మెల్యేనే ఎంతో నయం అన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

గుణదల ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు

- నేటి నుంచి మూడ్రోజుల పాటు నిర్వహణ
- వంద వసంతాల వేడుక ఆకట్టుకునేలా ముస్తాబు
- లక్షలాదిగా భక్తులు వచ్చే అవకాశం

- 6లో..





నివాళులర్పిస్తున్న దేవినేని ఉమా, కేశినేని చిన్ని, తంగిరాల సౌమ్య

దేవినేని ఇంట విషాదం

● చంద్రశేఖర్ మృతికి నాయకుల సంతాపం

కంచికచర్ల, ఫిబ్రవరి 8 : టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుటుంబంలో విషాదం నెలకొంది. దేవినేని ఉమా, దివంగత వెంకటరమణ సోదరుడైన చంద్రశేఖర్ (56) గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. చంద్రశేఖర్ కొద్దిరోజుల నుంచి ఊపిరితిత్తులకు సంబంధించిన న్యూమోనియా వ్యాధితో బాధపడుతున్నారు. శ్వాసకు ఇబ్బంది కలగటంతో చికిత్స నిమిత్తం వారం క్రితం ఆయన హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో చేరారు. మూడు రోజుల క్రితం ఆయనకు గుండెపోటు వచ్చింది. వైద్యులు మంగళవారం శస్త్రచికిత్స చేశారు. ఆరోగ్యంగా తిరిగి వస్తాడని అందరూ భావిస్తున్న తరుణంలో బుధవారం రాత్రి చంద్రశేఖర్ ఆరోగ్య పరిస్థితి ఒక్కసారిగా విషమించింది. గురువారం ఉదయం 5 గంటల సమయంలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. చంద్రశేఖర్ భౌతికకాయాన్ని గురువారం మధ్యాహ్నం స్వగ్రామం కంచికచర్లలోని ఇంటికి తీసుకొచ్చారు. ఉమాతో పాటు మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు.. చంద్రశేఖర్ భౌతికకాయంపై టీడీపీ జెండా కప్పి నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, వసంత కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, నెట్టెం రఘురామ్, నక్కా ఆనందబాబు, టీడీపీ నాయకులు కేశినేని చిన్ని, బుద్దా వెంకన్న, కనపర్తి శ్రీనివాసరావు, శ్రీరాం తాతయ్య, దాసరి బాలవర్ధనరావు, బోడె ప్రసాద్, నాగుల్‌మీరా, ఎంఎస్ బేగ్, నూతలపాటి బాల, చలసాని ఆంజనేయులు, ఆచంట సునీత, పట్టాభి, గన్నె వెంకట నారాయణ ప్రసాద్ (అన్నా), కోట వీరబాబు, ఆళ్ల గోపాలకృష్ణ నివాళి అర్పించారు. గురువారం దేవినేని రమణ ఘాట్ వద్ద అంత్యక్రియలు నిర్వహించారు.



దేవినేని చంద్రశేఖర్ (ఫైల్)

చచ్చినా వదలరు..!

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో శవ రాజకీయాలు

- 30వ డివిజన్ 29వ బూత్‌లో చనిపోయిన వారికి ఓట్లు
- 27 ఓట్లు తొలగించకుండా వేరే బూత్‌కు బదలాయింపు
- అధికార పార్టీ నేతల అండతో ఓ బీఎల్వో బాగోతం
- టీడీపీ నాయకుల పరిశీలనలో బయటపడిన నిజాలు
- మునిసిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

శవాలపై కూడా రాజకీయాలు చేసే రోజులు వచ్చేశాయి. ఓట్ల కోసం చనిపోయిన వారి ఓట్లను బతికున్నట్టుగా వేరే బూత్‌కు బదలాయించే నీచ ఆలోచనలు రాజ్యమేలుతున్నాయి. సెంట్రల్ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాలో ఇదే జరిగింది. చనిపోయిన వారి ఓట్లను తొలగించకుండా, బతికున్నట్టుగా చూపించి వేరే బూత్‌కు బదలాయించిన అధికార పార్టీకి చెందిన ఓ బీఎల్వో బాగోతం టీడీపీ నాయకుల పరిశీలనలో బయటపడింది.


(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇప్పటివరకు బతికున్న ఓటర్లనే అటు, ఇటు అక్రమంగా మార్పులు చేశారు. తాజాగా చనిపోయిన వారి ఓట్లను కూడా మార్చేసిన బాగోతాలు బయటపడ్డాయి. సెంట్రల్ నియోజకవర్గంలో చనిపోయిన వారి ఓట్ల తొలగింపునకు ప్రతిపక్షాల నుంచి కుప్పలుతెప్పలుగా దరఖాస్తులు రాగా, వాటిని తొలగించకుండా తెలివిగా బీఎల్వోలు బూతులు మార్చారు. ఓటర్ల తుది జాబితా పరిశీలనలో ఈ వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

అసలు నిజాలివీ..

30వ డివిజన్‌లోని 29వ నెంబర్ పోలింగ్ బూత్‌లో చనిపోయిన 27 ఓట్లను వేరే బూత్‌కు బదిలీ చేశారు. ఇలా బదిలీ చేసింది స్థానిక పోలింగ్ బూత్ ఆఫీసర్ (బీఎల్వో) సునీల్ కుమార్. చనిపోయిన వారి ఓట్ల తొలగింపునకు దరఖాస్తులొస్తే వాటిని తొలగించాల్సిన బీఎల్వో వేరే బూత్‌కు బదిలీ చేయటం వెనుక అనేక ఆరోపణలు వస్తున్నాయి. అధికార పార్టీకి ప్రయోజనం కల్పించేందుకే ఇలా చేశారని తెలుస్తోంది.

ప్రతిపక్షాన్ని దెబ్బతీసేందుకే...

గత ఎన్నికల్లో సెంట్రల్ నియోజకవర్గంలో అధికార పార్టీ చాలా స్వల్ప ఓట్లతో నెగ్గింది. ఈ దఫా ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉండటంతో ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశంతో వైసీపీ పెద్దలు బీఎల్వోలపై ఒత్తిళ్లు తెస్తున్నారు. ఓటర్ల తుది జాబితా వచ్చిన క్రమంలో ఎందుకైనా మంచిదని టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ నేతలు బూత్‌లవారీగా పరిశీలన ప్రారంభించారు. ఈ సూక్ష్మ పరిశీలనలో చనిపోయిన వారి ఓట్లు కనిపించాయి. వాస్తవానికి 30వ డివిజన్ 29వ నెంబర్ బూత్‌లో 27 మంది చనిపోయిన వారి ఓట్లు ఉన్నాయని టీడీపీకి చెందిన బీఎల్వోలు గతంలోనే గుర్తించారు. తాము గుర్తించిన అంశాలను పరిశీలించి నిర్ధారణ చేసుకున్నాక మునిసిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఆ ఓట్లను తొలగించినట్టుగా చూపారు. కానీ, తొలగించలేదు. వేరే బూత్‌కు మార్పు చేశారు. టీడీపీ నాయకుడు నవనీతం సాంబశివరావు మళ్లీ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌కు ఫిర్యాదు చేశారు. బీఎల్వో సునీల్ కుమార్‌పై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని కమిషనర్ హామీ ఇచ్చారు.



మృతిచెంది కూడా వేరే బూత్‌లో ఉన్న ఓటర్లు

ఆది నుంచీ ఇదే వైఖరి

సెంట్రల్ నియోజకవర్గంలో చనిపోయిన వారి ఓట్లను తొలగించటం లేదు. ఆధారాలు చూపుతున్నా పట్టించుకోవట్లేదు. కొంతకాలం సాంకేతిక కారణాలు సాకుగా చూపారు. చివరకు స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)లో కూడా సరి చేయలేదు. దీంతో ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ దశలో చనిపోయిన వారి ఓట్లను వేరే బూత్‌లకు బదిలీ చేసి మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. ఈ ఓట్ల స్థానంలో తెలంగాణ నుంచి వచ్చిన వారితో ఓట్లు వేయించే అవకాశం ఉందని ప్రతిపక్షాలు ఆందోళన చెందుతున్నాయి.



దివ్యపూజాబలి సమర్పిస్తున్న మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, గురువులు

నవదిన ప్రార్థనలకు పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు

ఘనంగా ముగిసిన నవదిన ప్రార్థనలు

గుణదల, ఫిబ్రవరి 8 : గుణదలమాత వంద వసంతాల వేడుకలు పురస్కరించుకుని గడచిన 9 రోజులుగా నిర్వహిస్తున్న నవదిన ప్రార్థనలు గురువారంతో ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయవాడ కతోలిక పీఠం మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు సందేశమిచ్చారు. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో పుణ్యక్షేత్ర ప్రాంగణం కిటకిటలాడింది. రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఎస్ఎస్‌సీ డైరెక్టర్ తోట సునీల్ రాజు, ఫాదర్ మరియన్న తదితర గురువులు దివ్య సత్ప్రసాద మదనంతో కొండపైకి చేరుకుని సమిష్టి దివ్యపూజాబలి సమర్పించారు.

గుణదలమాత ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

గుణదల : ఈ నెల 9, 10, 11 తేదీల్లో గుణదల మేరీమాత ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేసినట్టు విజయవాడ కతోలిక పీఠం మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మూడు రోజులపాటు జరగనున్న ఉత్సవాలకు ముఖ్యఅతిథులుగా విజయవాడ బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, భారత్, నేపాల్ దేశాల అపోస్థలిక రాయబారి లియోపొల్డో జిరెల్లి హాజరుకానున్నారని తెలిపారు. ఉత్సవాలకు లక్షలాదిగా భక్తులు తరలిరానుండటంతో రైల్వే, ఆర్టీసీ ఉన్నతాధికారులతో చర్చించి తగిన ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. దూరప్రాంతాల నుంచి వచ్చే రైళ్లను ఈ మూడు రోజులపాటు గుణదల స్టేషన్ వద్ద నిలిపేలా ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా బీఆర్టీఎస్ రోడ్డులో ఆర్టీసీ బస్సుస్టాప్ అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. బిషప్‌గ్రాసీ గ్రౌండ్‌లో మొబైల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వంద వసంతాల వేడుకల నేపథ్యంలో గురువులుగా దీక్షబూని 50 వసంతాలు, 25 వసంతాలు పూర్తిచేసుకున్న వారితో మొదటి రోజున వేదికపై దివ్యపూజాబలి సమర్పించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా తాగునిరు, పారిశుధ్య ఏర్పాట్లపై మున్సిపల్ సిబ్బందితోపాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సహాయం తీసుకుంటున్నట్టు చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురుకాకుండా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతి రాణా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు.



విజయలక్ష్మి, జనార్ధనరావులను సన్మానిస్తున్న ఆక్వాడెవిల్స్ ప్రతినిధులు

ఆరుపదుల వయసులో కృష్ణానదిని ఈదేశారు

» పొట్లూరి దంపతుల ఘనత

విజయవాడస్పోర్ట్సు, ఫిబ్రవరి 8 : అరవై సంవత్సరాలు పైబడిన వయస్సులో ఇటీవల జరిగిన రివర్ క్రాస్ పోటీల్లో పొట్లూరి విజయలక్ష్మి, పొట్లూరి జనార్ధనరావులు కృష్ణానది ఈది సత్తా చాటారని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, బీసీసీఐ మాజీ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్కే ప్రసాద్‌లు కొనియాడారు. విజయలక్ష్మి, జనార్ధనరావులు ప్రముఖ షోరూమ్ సోనోవిజన్ ఎండీ భాస్కరమూర్తి తల్లిదండ్రులు. ఈ సందర్భంగా ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన సన్మానసభలో ఈ ఘనత సాధించిన దంపతులను ఘనంగా సత్కరించారు.

విదేశాల్లో వెలిగిన కాకులపాడు తేజం మేఘన

» ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీ ఆప్తమాలజీలో సీటు కైవసం



తల్లిదండ్రులతో మేఘన చలసాని

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 8 : ప్రపంచ ప్రసిద్ధ క్లీవ్లాండ్ యూనివర్సిటీలో కంటి వైద్య విభాగంలో (అంతర్జాతీయ ప్రముఖులకు మాత్రమే) మేఘన చలసాని సీటు కైవసం చేసుకుంది. ఇటీవల జరిగిన ప్రవేశాల్లో మేఘన ఎంపికైనట్టు యూనివర్సిటీ నుంచి వచ్చిన ఉత్తర్వులను గురువారం అందుకున్నారు. కాకులపాడుకు చెందిన చలసాని పూర్ణబ్రహ్మయ్య కుమారుడు కృష్ణారావు, పద్మజ దంపతుల కుమార్తె మేఘన తల్లిదండ్రులతో కలిసి అమెరికాలోని ఓహియోలో ఉంటోంది. చిన్ననాటి నుంచి చదువులో రాణిస్తూ 24సంవత్సరాల వయస్సులోనే ఎండీ, ఎంబీఏ డబుల్ డిగ్రీ 7సంవత్సరాల్లోనే సాధించడంతో పాటు ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీలో వైద్య విద్యకు సీటు సాధించడం పట్ల తాత చలసాని పూర్ణబ్రహ్మయ్య హర్షం వ్యక్తం చేశారు. కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, కాకులపాడు సర్పంచ్ కాజ ప్రసాద్, చలసాని శ్రీనివాస్ తదితరులు ఫోన్‌లో అభినందనలు తెలిపారు.



నూతనంగా ఎన్నికైన వ్యవసాయ అధికారుల సంఘం నాయకులు

వ్య.అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కృష్ణలంక, ఫిబ్రవరి 8 : ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం నిర్వహించారు. రైతు సాధికార సంస్థ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కార్యాలయంలో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షులుగా కె.రఘురామ్ (విజయవాడ అర్బన్ వ్యవసాయ అధికారి), ఉపాధ్యక్షురాలిగా ఎం.స్వప్న (వ్యవసాయ అధికారి, జిల్లా కార్యాలయం, విజయవాడ) కార్యదర్శిగా ఆర్.సురేష్ (వ్యవసాయ అధికారి, రెడ్డిగూడెం) కోశాధికారిగా షేక్ టిప్పు సుల్తాన్ (వ్యవసాయ అధికారి, ఎ.కొండూరు) సంయుక్త కార్యదర్శిగా ఎస్.వాణి అనూష (వ్యవసాయ అధికారి జీవనియంత్రణ ప్రయోగశాల, ఇబ్రహీంపట్నం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపికలో రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షులు బాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి మురళీకిషోర్ పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ ప్రతినిధులు జేఏసీ నాయకులు అభినందించారు.

టెట్ ఫలితాల తర్వాతే డీఎస్సీకి అవకాశం కల్పించాలి

» కలెక్టర్‌కు విన్నవించిన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల విద్యార్థులు



కృష్ణలంక, ఫిబ్రవరి 8 : కృష్ణాజిల్లాలో ఎస్జీటీ పోస్టులు పెంచాలని, టెట్ పరీక్ష మార్చి నెలాఖరున జరపాలని, టెట్ ఫలితాలు విడుదలయ్యాకే డీఎస్సీకి దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించాలని కోరుతూ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల విద్యార్థులు గురువారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. 2018 నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నామని, ప్రస్తుతం నోటిఫికేషన్ విడుదల చేసి తక్కువ పోస్టులతో మరింత తక్కువ కాలంలో ఇప్పుడే విడుదల చేసిన సిలబస్‌తో తమకు ప్రిపరేషన్ కష్టసాధ్యంగా వుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎస్జీటీ, ఎస్ఎలలో పోస్టులను పెంచి ఇప్పుడే ప్రకటించిన సిలబస్ ప్రిపేర్ అయ్యేందుకు కావాల్సిన కాలపరిమితిని ఇప్పించాల్సిందిగా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

బోట్లు.. పొట్లు!

కాసుల కోసం కక్కుర్తి..

పర్యాటకుల ప్రాణాలతో ఏపీ టీడీసీ చెలగాటం!

» గుజరాత్ నుంచి సెకెండ్ హ్యాండ్ మెకనైజ్డ్ బోట్లు, సేఫ్టీ బోట్లు

» రూ. లక్షలు వెచ్చించి బోట్లను కొనుగోలుపై సర్వత్రా విమర్శలు



గుజరాత్ నుంచి కొనుగోలు చేసిన సెకండ్ హ్యాండ్ మెకనైజ్డ్(వెన్నెల) బోట్లు, సేఫ్టీ బోట్లు


(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

గుజరాత్ నుంచి సెకండ్ హ్యాండ్ బోట్లను కొనుగోలు చేసి కృష్ణానదిలో తిప్పేందుకు ఏపీటీడీసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. సెకండ్ హ్యాండ్ బోట్లు ట్రయల్స్‌లోనే బోటింగ్ పైలట్లకు చుక్కలు చూపించడంతో వీటికి మరమ్మతులు కూడా చేపడుతున్నారు. పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలంటే

కృష్ణానదిలో బోటింగ్ విహారం పేరుతో కోట్ల రూపాయలు దండుకుంటున్న అధికారులు ఎప్పుడో కాలం చెల్లిన బోట్లను తిప్పుతూ పర్యాటకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఆదాయార్జనే ధ్యేయంగా.. ఏపీటీడీసీ అధికారులు కొత్త బోట్ల కొనుగోలులో కక్కుర్తి వ్యవహారం విమర్శలకు తావిస్తోంది. బోటింగ్‌కు ఉన్న ఆదరణ, ఆదాయం చూస్తే కొత్త బోట్లు కొనుగోలు చేసి పర్యాటకాన్ని వృద్ధి చేసుకోవాల్సిన ఏపీటీడీసీ రూ. లక్షలు ఖర్చు పెట్టి సెకండ్ హ్యాండ్ బోట్లను కొనుగోలు చేయటం పర్యాటక శాఖలో పెను దుమారాన్ని రేపుతోంది.

ఇలాంటి బోట్లనా కొనేది.. పర్యాటకుల భద్రతను ఏపీటీడీసీ అధికారులు గాలిలో దీపంలా మార్చివేశారు. కృష్ణానదిలో పన్నెండు అడుగుల లోతు ఉండే స్టోరేజ్ రిజర్వాయర్‌లో బోట్లను నడపటం అంటే ఆషామాషీ కాదు.. గతంలో పవిత్ర సంగమం, గోదావరిలో బోటు ప్రమాదాల నేపథ్యంలో, పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కొన్ని పాలసీలు తీసుకు వచ్చారు. దాని ప్రకారం సముద్రంలో తిరిగే బోట్లకు ఎలాంటి అనుమతులు ఉంటాయో అదే రకమైన నిబంధనలు ఇక్కడ కూడా అమలు చేయాల్సి ఉంటుంది. దీనికి భిన్నంగా ఏపీటీడీసీ అధికారులు లక్షలు వెచ్చించి సెకండ్ హ్యాండ్ బోట్లను కొనుగోలు చేయటం తీవ్ర వివాదాన్ని సృష్టిస్తోంది. బోట్ల కొనుగోలు వెనుక భారీ ఎత్తున గోల్‌మాల్ జరిగిందన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. గుజరాత్‌లో కాలం చెల్లిన బోట్లను ఏపీటీడీసీ అధికారులు కొనుగోలు చేసినట్టుగా తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ఒక జీఎం అధికారి తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి. పదవీ విరమణ చెందినా ఈ అధికారి చెలామణి అవుతూ హరిత బెర్మ్ పార్క్‌లో ఏడాదిన్నరగా తిష్ట వేసి ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి. రాష్ట్రంలోనే భవానీ ఐల్యాండ్, హరిత బెర్మ్‌పార్క్‌ల ద్వారా ఏపీటీడీసీకి గణనీయమైన ఆదాయం వస్తోంది. బోటింగ్ యూనిట్ ద్వారా ఇప్పటి వరకు ఏపీటీడీసీ కొన్ని కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చుకుంది. డిమాండ్ ఉన్న బోటింగ్ యూనిట్‌లోకి సరికొత్త బోట్లను తీసుకురావటం ద్వారా మరింతగా పర్యాటకుల ఆదరణను చూరగొనే అవకాశం ఉంది.

ఏపీటీడీసీ కృష్ణానదిలో నడుపుతున్న బోట్ల విషయానికి వస్తే భవానీ, బోధిసిరి, క్రిష్ణవేణి, జగదాంబ, ఆమరపాలి, జలజాక్షి, ధరణి, పాంటూన్, పోలిక్రాఫ్ట్ బోట్లలో సింహభాగం కాలం చెల్లిపోయి తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. మరమ్మతుల పేరుతో లక్షలు ఖర్చు చేస్తున్నారు కానీ కొత్త బోట్లను కొనుగోలు చేయటం లేదు. ఈ బోట్లకు మరమ్మతులకు పెడుతున్న ఖర్చుతో కొత్త బోట్లను కొనుగోలు చేయవచ్చు. ఇటీవల కృష్ణానదిలో పర్యాటకుల విహారానికి కొత్త బోట్లను కొనుగోలు చేయనున్నట్టు ఏపీటీడీసీ అధికారులు ప్రకటించారు. అయితే కొత్తబోట్ల స్థానంలో సెకండ్ హ్యాండ్ బోట్లను కొనుగోలు చేశారు. రెండు రంగువెలిసిపోయిన మెకనైజ్డ్ బోట్లను కొనుగోలు చేశారు. వీటికి వెన్నెల అని నామకరణం చేశారు. గుజరాత్ నుంచి ఈ బోట్లను కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. ఈ బోట్లను కృష్ణానదిలో నడపడం కూడా కష్టంగానే కనిపిస్తోంది.



ట్రయల్ రన్‌లో మోటార్ బ్లేడ్ చేపల వలకు చిక్కి బోటు కలవరపెట్టింది. ఇలాంటి మెకనైజ్డ్ బోట్లను ఉపయోగించటం కత్తిమీద సాములాంటిదే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరో రెండు చిన్న బోట్లను సెకండ్ హ్యాండ్‌లో కొనుగోలు చేశారు. ఇవి సముద్రంలో షిప్పలకు కట్టిఉంచే సేఫ్టీ బోట్లు. ఈ బోట్లను స్పీడ్ బోట్లుగా ఉపయోగించాలని భావిస్తున్నారు.

ఈ బోట్లకు అనుమతులు అనుమానమే!

గుజరాత్ నుంచి కొనుగోలు చేసిన సెకండ్ హ్యాండ్ బోట్లకు అనుమతులు వచ్చే అవకాశం కనిపించడం లేదు. సెకండ్ హ్యాండ్ బోట్లు కావటంతో ఇన్సూరెన్స్ చేయటం కూడా ప్రశ్నార్థకంగా ఉంది. ఇలాంటి బోట్లకు ఇరిగేషన్ శాఖ రూట్ పర్మిషన్లు ఇవ్వటం కూడా అనుమానమే. అన్నింటికీ మించి మెకనైజ్డ్ బోట్లు రెండూ ప్రయాణికుల సమూహాన్ని సురక్షితంగా తీసుకు వెళ్లగలవా అన్న పరీక్షలను కూడా చేయాల్సి ఉంది. ఈ పరీక్షలను తట్టుకునే అవకాశం కూడా కనిపించటం లేదు. ఈ బోట్లకు అనుమతులు రావాలంటే వీటిని ఎవరు తయారు చేశారు.. ఎంత కాలం వినియోగించారు.. ఏ కారణంగా వీటిని తీసేశారు.. వంటి విషయాలు కూడా తెలియాల్సి ఉంటుంది.

నత్తనడకన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

» పనిచేయని సర్వర్లు.. లబ్ధిదారుల పడిగాపులు



కూచిపూడి, ఫిబ్రవరి 8 : జగనన్న సెంటు స్థలాల లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నత్తనడకగా సాగుతోంది. దీంతో లబ్ధిదారులు రోజుల తరబడి కార్యాలయాల వద్ద పడిగాపులు పడుతున్నారు. ఈ నెల 2వ తేదీన ప్రక్రియ ప్రారంభం కాగా, ప్రతీ రోజు రాత్రి 10 గంటల వరకు కార్యాలయ సిబ్బంది, లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. లబ్ధిదారుడు, వీఆర్వోతోపాటు సచివాలయ కార్యదర్శి వేలిముద్రలు రెండేసి పర్యాయాలు తీసుకోవటంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కూచిపూడిలో లబ్ధిదారులు 239 మంది ఉండగా, వారం వ్యవధిలో 34 రిజిస్ట్రేషన్లు మాత్రమే పూర్తయ్యాయి. 21 గ్రామపంచాయతీల్లో 1766 మంది లబ్ధిదారులు ఉండగా, బుధవారం నాటికి 350 రిజిస్ట్రేషన్లు మాత్రమే పూర్తయ్యాయి. సర్వర్లు పనిచేయకపోతే రిజిస్ట్రేషన్లు ఎలా పూర్తవుతాయని కార్యాలయ సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే.. 12 నుంచి ఆందోళన

» ఏపీఎన్జీవోల సంఘం వెస్ట్ కృష్ణా అధ్యక్షుడు విద్యాసాగర్

వన్‌టౌన్, ఫిబ్రవరి 8 : ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 12 నుంచి ఆందోళన చేపడతామని ఏపీఎన్జీవోల సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు ప్రభుత్వానికి సహకరించామని, సమస్యల పరిష్కారంలో వాయిదాలు తప్ప ముందుకు సాగలేదని అన్నారు. ప్రభుత్వంలో ఏమాత్రం స్పందన లేదని, సహనాన్ని పరీక్షించవద్దని ప్రభుత్వానికి సూచించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణలో ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 12 నుంచి ఆందోళనకు దిగుతామని, ఈమేరకు ఉద్యోగుల మనోభావాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఈనెల 11న విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి ప్రధాన కార్యదర్శికి నోటీసు ఇస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్

చరిత్రలో ఇటువంటి దుస్థితి ఎన్నడూ చూడలేదు : యూటీఎఫ్

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యారంగానికి కోట్లాది రూపాయలు వ్యయం చేస్తున్నామని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను తగ్గిస్తున్నారని కొత్త అధ్యాపక పోస్టుల నియామకం లేదని, మౌలిక సదుపాయాల కల్పన కేవలం ప్రచార ఆర్భాటమేనన్నారు. పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ధాలినాయుడు మాట్లాడుతూ, ఉద్యోగ సమయంలో ప్రభుత్వంపై నమ్మకంతో దాచుకున్న డబ్బును నిర్ణీత సమయానికి ఖాతాలో జమ చేయకపోవడం పదవీవిరమణ చేసిన ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యవైఖరిని స్పష్టం చేస్తోందన్నారు. అదనపు క్వాంటమ్‌ను పునరుద్ధరించాలన్నారు. ఎన్జీవో సంఘం నాయకులు ఎండీ ఇక్బాల్, ఎ.సాంబశివరావు, సాయిరాం, గెజిటెడ్ అధికారుల సంఘం సహ అధ్యక్షుడు డీ ఎస్ ఎన్ రెడ్డి, ఎం రాజబాబు, కె సంపత్‌కుమార్, ఎస్‌కే నజిరుద్దీన్, బీవీ రమణ, కే శివలీల, జయశ్రీ, సత్యనారాయణ రెడ్డి, సీహెచ్ మధుసూధనరావు, ఎస్‌కే ఖాశిం,సీహెచ్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రమేశ్‌బాబును నిలదీస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

పార్టీ మారారని ఎంపీ ఫొటో తొలగిస్తారా..

» సచివాలయ భవన ప్రారంభంలో ప్రొటోకాల్ రగడ!

» ఎమ్మెల్యేను నిలదీసిన సర్పంచ్, ఎంపీటీసీలు



ఘంటసాల, ఫిబ్రవరి 8 : యండకుదురులో నూతనంగా నిర్మించిన సచివాలయ భవన ప్రారంభోత్సవంలో ఎంపీ బాలశౌరి ఫొటో లేకుండా శిలాఫలకం ఏర్పాటు చేయటంపై జనసేన నేత పూషడం సర్పంచ్ అంకం మారుతీరావు, ఎంపీటీసీ సిద్ధినేని కుమార్‌రాజాలు ఎమ్మెల్యేను నిలదీశారు. ఘంటసాల మండల పరిధిలోని యండకుదురు గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, ఆర్బీకే సెంటర్‌ను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు గురువారం ప్రారంభించారు. ఎంపీ పార్టీ మారారని, ప్రొటోకాల్ లిస్టు ప్రకారమే ఫొటో వేయటం జరుగుతుందని ఎమ్మెల్యే తెలపటంతో.. గుడివాడలో జరిగిన కార్యక్రమంలో శిలాఫలకంపై ఎంపీ ఫొటో ముద్రించారని సర్పంచ్ సమాధానమిచ్చారు. కావాలనే ఎంపీ ఫొటో తీసివేశారని సర్పంచ్, జనసైనికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



అంబటి రాంబాబు, పేర్ని నానిల చిత్రపటాలను చెప్పులతో కొడుతున్న వీరమహిళలు, జనసైనికులు

ఎంపీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తడఖా చూపిస్తాం..

మోపిదేవి : మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరిపై వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు అనుచిత వ్యాఖ్యలు చేస్తే జన సైనికుల తడఖా చూపిస్తామని పార్టీ నాయకులు హెచ్చరించారు. బాలశౌరిపై మంత్రి అంబటి రాంబాబు, మాజీ మంత్రి పేర్ని నానిల అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వైసీపీ నేతల చిత్రపటాలను చెప్పులతో కొట్టి, కాళ్లతో తన్ని నిరసన తెలిపారు. అవనిగడ్డ, మోపిదేవి, చల్లపల్లి, నాగాయలంక మండలాల నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీ కార్యాలయం నుంచి కొవ్వొత్తులతో ర్యాలీగా ప్రధాన కూడలికి చేరుకున్నారు. ఖబడ్దార్ వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు పూషడపు రత్న గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు..

పెడన రూరల్/బంటుమిల్లి : జగన్ పాలన పట్ల అసంతృప్తితో, టీడీపీ చేపట్టనున్న విధానాలకు ఆకర్షితులై వైసీపీ నేతలు అనేక మంది తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. నడుపూరు గ్రామంలోని దావు శ్రీరాములుకుటుంబంతోపాటు పలువురిని పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గురువారం 'బాబు ష్యూరిటి భవిష్యత్ గ్యారంటి' కార్యక్రమంతో ఇంటింటి ప్రచారం చేశారు. అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, బొడ్డు చినబాబు, పరసా కామేశ్వరరావు, పుప్పాల నాని, పరసా ధనాంజనేయులు, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

బంటుమిల్లిలో నాగన్న చెరువు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం కాగిత కృష్ణప్రసాద్ ఇంటిలో గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్, 40 కుటుంబాలు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అవనీతిపాలన, రాక్షసవైఖరి తట్టుకోలేక తెలుగుదేశం పార్టీలోకి వచ్చామని వారు చెప్పారు. కాగిత కృష్ణప్రసాద్ విజయానికి తమవంతు కృషి చేస్తామన్నారు.



కాగిత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ కండువాలు కప్పుకున్న వైసీపీ నేతలు

అధినేత నిర్ణయానికి కట్టుబడి ఉంటా.. : వేదవ్యాస్

బంటుమిల్లి : రానున్న ఎన్నికల్లో పెడన నియోజకవర్గ సీటు కేటాయింపు విషయంలో టీడీపీ, జనసేన అధినేతల నిర్ణయానికి కట్టుబడి ఉంటానని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. గురువారం మండలంలో పర్యటన అనంతరం ఆయన చినగొల్లపాలెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, 15 సంవత్సరాల క్రితం తాను మండలానికి చేసిన అభివృద్ధి పనులను ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో చంద్రబాబునాయుడు తనకు సీటుపై హామీ ఇచ్చారని, ఆయన మాటమీద నిలబడతారని నమ్మకముందన్నారు. చంద్రబాబు మాటకు కట్టుబడి ఉంటానని నన్నారు. జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి నడకుదుటి బ్రహ్మం, పుప్పాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బూరగడ్డ వేదవ్యాస్

మంత్రి జోగి రమేశ్‌కు నిరసన సెగ

» మౌలిక వసతులు కల్పించాలని రోడ్డెక్కిన గంగూరు వాసులు,

» జాతీయ రహదారిపై ఉద్రిక్తత

పెనమలూరు : మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్‌కు నిరసన సెగ తగిలింది. బందరు రోడ్డును ఆనుకొని ఉన్న గంగూరు ఏఆర్‌నగర్ కాలనీ వాసులు తమ కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించాలంటూ గురువారం జాతీయ రహదారిపైకి వచ్చి నిరసన తెలిపారు. దీంతో కాసేపు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెకొన్నాయి. దశాబ్దాలు గడుస్తున్నా తమ కాలనీపై పాలకులు శీతకన్ను వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తాగేందుకు శుభ్రమైన నీటికి తాము నోచుకోలేదా అని ప్రశ్నించారు. కాలనీలో వస్తున్న మంచినీటిని బాటిళ్లలో తెచ్చి ప్రదర్శించారు. కాలనీవాసుల ఆందోళన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వారి వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. దీంతో నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేశ్ అక్కడికి రాగా ఆయనకు కాలనీవాసులు మురికిగా ఉన్న నీళ్ల శాంపిల్స్‌ను అందజేసి నిరసన వ్యక్తం చేశారు. త్వరలో కాలనీలో మౌలిక వసతులకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చి మంత్రి వెళ్లిపోయారు.



మురికి నీటి బాటిళ్లను మంత్రి జోగి రమేశ్‌కు ఇచ్చి నిరసన తెలుపుతున్న స్థానికులు

డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 8 : కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను గురువారం విడుదల చేశారు. విశ్వవిద్యాలయం పరిధిలో 5733 మంది హాజరు కాగా, 3260 మంది ఉత్తీర్ణులై 56.86 శాతం ఉత్తీర్ణత సాధించారు. పునఃమూల్యాంకనానికి ఈనెల 19లోగా దరఖాస్తు చేసుకోవచ్చని రిజిస్ట్రార్ తెలిపారు.



సంఘటనపై విచారిస్తున్న సీఐ జానకీరాం

వివాహిత హత్యాయత్నంపై ప్రత్యేక బృందాల విచారణ

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 8 : పట్టణంలో బుధవారం రాత్రి జరిగిన మిల్క్‌పార్లర్ నిర్వాహకురాలు గోపిరెడ్డి సత్యశ్రీ(35) హత్యాయత్నంపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. విజయవాడ ఏసీపీ ఆదేశాల మేరకు ముగ్గురు సీఐల పర్యవేక్షణలో ఆరుగురు ఎస్సైలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బాధితురాలి కుమార్తె (15) ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ జానకిరాం తెలిపారు. విజయవాడలో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సత్యశ్రీ ఆరోగ్యం విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. సంఘటనా స్థలంలో ఉన్న సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలి మొబైల్ ఫోన్ కాల్‌డేటా ఆధారంగా విచారిస్తున్నారు. సత్యశ్రీ కోలుకుని నోరు విప్పితే అసలు విషయం బయటకు వచ్చే అవకాశం ఉంది. ఆమె వద్ద పనిచేసిన వ్యక్తుల నుంచి, ఆర్థిక లావాదేవీలు నడిపిన వ్యక్తులను విచారిస్తున్నారు. సత్యశ్రీ వ్యక్తిగత జీవితంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. గోదావరి జిల్లాకు చెందిన వ్యక్తిని కులాంతర వివాహం చేసుకుందని చెబుతున్నారు. అయితే బంధువులు, కుటుంబసభ్యులు తమకు ఎవరిపైనా అనుమానాలు లేవని చెబుతుండటంతో కేసు పోలీసులకు సవాల్‌గా మారింది.

కేవీపీని కలిసిన పీసీసీ చీఫ్ షర్మిల



హనుమాన్‌జంక్షన్ రూరల్ : పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అంపాపురంలోని కేవీపీ రామచంద్రరావు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం పశ్చిమగోదావరి జిల్లా దెందులూరు మండలంలోని పోతునూరులో జరిగే సమావేశానికి వెళుతూ మార్గమధ్యలో అంపాపురంలో కేవీపీ ఇంటికి వచ్చారు. తన తండ్రికి ప్రాణస్నేహితైన రామచంద్రరావును కలిసేందుకే వచ్చానని ఆమె తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రఘువీరారెడ్డి, రుద్రరాజు, సంకర పద్మశ్రీ ఆమె వెంట ఉన్నారు. గన్నవరం నియోజకవర్గంలో బహిరంగసభ నిర్వహించే ఆలోచనతోనే అంతర్గత సమావేశం జరిగినట్టు సమాచారం. సుంకర సుబాష్‌చంద్ర బోస్, కొండపావులూరి రమేష్ తదితరులు షర్మిలను కలిసి మాట్లాడారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	136, 145, 156
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.46

మార్చి నెలాఖరుకు 900 పంట కుంటల నిర్మాణం పూర్తి

● డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత



విజయవాడ రూరల్, ఫిబ్రవరి 8 : ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి 900 పంట కుంటల నిర్మాణాలను పూర్తి చేస్తామని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత తెలిపారు. నున్న గ్రామంలోని మామిడి తోటల్లో పంటకుంటల తవ్వకాలను గురువారం ఆమె పరిశీలించారు. భూగర్భ జలాలను పెంచేందుకు కుంటలు దోహదపడతాయని సునీత పేర్కొన్నారు.



ఉయ్యూరు టీటీడీ కల్యాణ మండపంలో ఆశా వర్కర్లు



జంక్షన్ ఎస్ఆర్ కన్వెన్షన్‌లో నినాదాలు చేస్తున్న ఆశా వర్కర్లు

ఎక్కడికక్కడ ఆశా వర్కర్ల నిర్బంధం

ఉయ్యూరు, ఫిబ్రవరి 8 : చలో విజయవాడ ఆందోళన వెళుతున్న ఆశా వర్కర్లను పట్టణ స్టేషన్ ఆఫీసర్ ఎండీ హబీబ్ బాషా, స్టేషన్ ఎస్సై గణేశ్‌కుమార్, రూరల్ ఎస్సై అవినాశ్, సిబ్బంది అడ్డుకుని ఉయ్యూరులోని టీటీడీ కల్యాణ మండపం, కాటూరులోని కల్యాణ మండపంలో నిర్బంధించారు. **హనుమాన్‌జంక్షన్:** ఏలూరు, నరసాపురం ప్రాంతాల నుంచి చలో విజయవాడకు వెళుతున్న ఆశా వర్కర్లను హనుమాన్‌జంక్షన్‌లో పోలీసులు అరెస్టులు చేసి ఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో నిర్బంధించారు. సాయంత్రం వరకు హాలులో ఉంచి, తర్వాత విడుదల చేశారు. బాపులపాడు మండలంలోని ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు, సీఐటీయూ నాయకులను హౌస్ అరెస్టులు చేశారు. **కంకిపాడు:** ఆశా వర్కర్లు చేస్తున్న న్యాయమైన పోరాటాన్ని ప్రభుత్వం పోలీసులతో అడ్డుకోవడం సిగ్గుచేటని జనసేన పెనమలూరు నియోజకవర్గ సమన్వయ కర్త ముప్పా రాజా అన్నారు.చలో విజయవాడకు వెళుతున్న ఆశా వర్కర్లను పోలీసులు నిర్బంధించడంతో వారికి రాజా సంఘీభావం తెలిపారు. సీఐటీయూ మండల కార్యదర్శి తాడంకి నరేష్, వి. వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు సుంకర శివ, పిచ్చుక క్రాంతి, బోయిన నాగరాజు, ఓంకార్, సుంకర సురేష్, కుంటా గంగాధర్ పాల్గొన్నారు. చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న ఆశ వర్కర్లను పోలీసులు టోల్‌గేట్ వద్ద అడ్డుకున్నారు. టోల్‌గేట్ వద్ద భారీగా మోహరించిన పోలీసులు ఆర్టీసీ బస్సులు, ఆటోలను తనిఖీ చేశారు. కంకిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, కంకిపాడు ఎస్సై-2 చార్యులు పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్‌రూరల్:** చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న ఆశా వర్కర్లతోపాటు ఇళ్లవద్ద ఉన్న వారినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టి.నరసాపురానికి చెందిన ఆశా వర్కర్లు దేవమాత, విజయ నిర్మల తదితరులు బస్సులో వెళుతుండగా బొమ్ములూరు వద్ద అదుపులోకి తీసుకున్నారు. హనుమాన్‌జంక్షన్ ఎస్సై జనార్దన్, వీరవల్లి ఎస్సై చిరంజీవి ఆధ్వర్యంలో ఆయా పోలీ స్‌స్టేషన్ల పరిధిలో 25 మంది ఆశావర్కర్లను ముందస్తుగా అదుపులోకి తీసుకుని స్టేషన్లకు తరలించారు. వివిధ పోలీ స్‌స్టేషన్ల పరిధిలో అదుపులోకి తీసుకున్న ఆశావర్కర్లను సొంత పూచీకత్తుపై సాయంత్రం పోలీసులు విడుదల చేశారు. **ఉంగుటూరు:** మండలంలోని 40 మంది ఆశావర్కర్లను గురువారం పోలీసులు నిర్బంధించారు. ఆశావర్కర్స్ యూనియన్ మండల మహిళా నాయకులు 12 మందిని అరెస్ట్‌చేసి ఆత్కూరు, ఉంగుటూరు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఆయా పీఎస్‌ల ఎదుట ఆశావర్కర్లు నిరసన దీక్ష చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు ఆమోదించేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని, పోలీసులతో ఉద్యమాన్ని అణచలేరని ఆశావర్కర్స్ యూనియన్ మండల నాయకులు కోటేశ్వరమ్మ, రజిని, రంగమ్మ, శాంత స్పష్టంచేశారు. ఉంగుటూరు పీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ మహిళానేతలకు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు వి.నాగరాజు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా సహాయ కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ జిల్లా నాయకురాలు టీవీ రమణ సంఘీభావం తెలిపారు. **గన్నవరం :** ఆశా వర్కర్ల నిర్బంధం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్లం వెంకటేశ్వరరావు అన్నారు. మహిళలని చూడకుండా అమానుషంగా గన్నవరం తీసుకువచ్చి రోటరీక్లబ్‌లో నిర్బంధించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లను ఆయన పరామర్శించారు. ముస్తాబాదకు చెందిన ఆశావర్కర్ నాగలక్ష్మి మేనత్త చనిపోయిందని, ఆ సమయంలో పోలీసులు చూసి వెంటనే పంపుతామని చెప్పి తీసుకొచ్చారని, 20 గంటలు నిర్బంధించడం ఏంటని ఆయన ప్రశ్నించారు.



ఉయ్యూరు 20వ వార్డులో బాబు ష్యూరిటీలో బోడె ప్రసాద్



సనత్‌నగర్‌లో పర్యటిస్తున్న వెంకట్రామ్, శంకరబాబు

వైసీపీ ప్రభుత్వానికి పోయే కాలం

ఉయ్యూరు, ఫిబ్రవరి 8 : అసమర్థ, అవినీతి, అరాచక వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోడె ప్రసాద్ హెచ్చరించారు. నగరపంచాయతీ పరిధి 20వ వార్డులో గురువారం ఆయన బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బూటకపు హామీలిచ్చి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి, అన్నీ మరచి అన్నివర్గాలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతాలు పెంచాలని కోరేందుకు చలో విజయవాడ వెళుతున్న ఆశావర్కర్లను గృహ నిర్బంధం చేయడం దారుణమన్నారు. కౌన్సిలరు పి.సుధారాణి, మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, పార్టీ నాయకులు గుర్నాథరావు, చిరంజీవి, వాసు, జయదేవ్, జంపాన శ్రీనివాసరావు, పైడయ్య, చక్కా సుబ్బారావు, నజీర్, జరీనాబేగం, శేఖర్, అజ్మతుల్లా, అప్పలనాయుడు, వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు కార్తికేయ, చినకోటయ్య, అనిత, మహాలక్ష్మి పాల్గొన్నారు. వార్డు పర్యటనకు వచ్చిన బోడె ప్రసాద్‌కు స్థానికులు ఘనస్వాగతం పలికారు. **పెనమలూరు:** రాష్ట్రవ్యాప్తంగా టీడీపీకి జనాదరణ విపరీతంగా పెరిగిందని టీడీపీ నాయకులు బోడె వెంకట్రామ్, వెలగపూడి శంకరబాబు, షేక్ బుజ్జి, రెహమాన్ పేర్కొన్నారు. గురువారం కానూరు సిద్ధిఖ్‌నగర్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో వారు స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. చంద్రబాబు, లోకేశ్‌ను తిడితేనే వైసీపీలో ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇచ్చే నీచస్థాయికి వైసీపీ దిగజారిందని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేసి టీడీపీ-జనసేన మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. అనుమోలు ప్రభాకరరావు, అంగిరేకుల మురళి, అబ్దుల్ రియాజ్, ఇమాం, బచ్చన్, రఫీ, షకీలా, సయ్యద్ షహీనా పాల్గొన్నారు.

పూరిల్లు, గేదెల చావిడి దగ్ధం

● రెండు చూడి గేదెలకు తీవ్రగాయాలు

ఉయ్యూరు, ఫిబ్రవరి 8 : నాగన్నగూడెంలో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో నిమ్మగడ్డ నరసింహారావుకు చెందిన పూరిల్లు, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావుకు చెందిన గేదెల చావిడి, రెండు చూడిడిగేదెలు కాలిపోయా యి. ఇంటిలో నుంచి ఒక్కసారిగా మంటలు లేచి చుట్టుముట్టి పక్కనే ఉన్న గేదెల చావిడికి అంటుకున్నాయి. రెండు గేదెలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.4లక్షలకు పైగా నష్టం వాటిల్లి ఉంటుందని అంచనాగా అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. విద్యుత్ షార్టున ర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నామన్నారు.

ఆర్డీవో పోలింగ్ కేంద్రాల తనిఖీ



ఉయ్యూరు, ఫిబ్రవరి 8 : ఉయ్యూరులో పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో డి.రాజు గురువారం తనిఖీ చేశారు. ఏజీఅండ్‌ఎస్‌జీఎస్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, సీబీఎం స్కూల్, వీఆర్‌కెఎం పాఠశాలల్లో పోలింగ్ బూత్‌లను తనిఖీచేసి, పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. నగర పంచాయతీ కమిషనర్ పి.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

విజయవాడ రూరల్ : నున్నకు చెందిన మల్లెల నాగరాజు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. టీడీపీ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలతో నాగరాజును టీడీపీ నేత, న్యాయవాది తగరం బసవ కిరణ్‌బాబు పరామర్శించి రూ.5 వేలు అందజేశారు. కలకోటి శ్రీనివాసరెడ్డి, మాదు మహేష్, దండు సుబ్రహ్మణ్యంరాజు, బోకొనాల తిరుపతి రావు, గంప శ్రీనివాస్, పామర్తి శ్రీను ఉన్నారు.

బాబా మందిర వార్షికోత్సవం

హనుమాన్‌జంక్షన్ : ఐటీఐ రోడ్డులోని షిరిడి సాయిబాబా మందిరం 18వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాబాకు ప్రత్యేక పూజలు, పాలాభిషేకాలు, సంకీర్తనలు నిర్వహించారు. విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వడ్డిల్లి లక్ష్మి బాబాను దర్శించుకుని, పూజలు చేశారు. 2వేల మందికి అన్నదానం చేశారు. ఏర్పాట్లను మందిర అభివృద్ధి కమిటీ చైర్మన్ కొల్లి వెంకటరావు, పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

నేత్ర, దంత పరీక్షలు

ఉయ్యూరు, ఫిబ్రవరి 8 : రోటరీ క్లబ్, రోటరీ నేత్రవైద్యశాల ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించి 180మందికి నేత్ర, దంత పరీక్షలు చేశారు. రామకృష్ణ రిక్రియేషన్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన శిబిరంలో రోటరీ వైద్యశాల నేత్రవైద్యులు వరలక్ష్మి, దంత వైద్యులు అనిత సిబ్బంది, రోటరీక్లబ్ కార్యవర్గం పాల్గొని సేవలందించారు. వాహనాలు నడిపే డ్రైవర్లు నేత్ర పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు.





రహదారి భద్రతా మాసోత్సవాల్లో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురేంద్రరావు

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

ఉయ్యూరు, ఫిబ్రవరి 8 : రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలని వాహనాలు నడిపే డ్రైవర్లకు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురేంద్రరావు సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రామకృష్ణ రిక్రియేషన్ క్లబ్ ఆడిటోరియంలో గురువారం ఉయ్యూరు రవాణాశాఖ యూనిట్ కార్యాలయం పరిధిలో డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాహనాలు నడిపేవారు తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలను వివరించారు. వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడితే కలిగే అనర్థాలను వివరించారు. ఉయ్యూరు, గుడివాడ ఆర్టీవోలు సుబ్బారావు, విజయసారథి, కమిషనర్ వెంకటేశ్వరరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ కేఎస్ఆర్‌కే ప్రసాద్, రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ గవర్నర్ సయ్యద్ అనీస్ పాల్గొన్నారు.

విజయవాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా రౌతు రాంబాబు



విజయవాడ రూరల్, ఫిబ్రవరి 8: కాంగ్రెస్ పార్టీ విజయవాడ మండలాధ్యక్షుడిగా నున్న గ్రామానికి చెందిన రౌతు రాంబాబు నియమితులయ్యారు. మచిలీపట్నంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వింతా సంజీవరెడ్డి గురువారం రాంబాబుకు నియామకపత్రాన్ని అందజేశారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని రౌతు రాంబాబు పేర్కొన్నారు.

అమెరికా భర్త మోసంపై ఫిర్యాదు

పెనమలూరు, ఫిబ్రవరి 8 : లక్షల కట్నం తీసుకొని వివాహానంతరం కాపురానికి అమెరికా తీసుకెళతానని, తీసుకెళ్లకుండా పెళ్లయిన పది రోజులకే అమెరికా వెళ్లిపోయిన భర్తపై అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోరంకి గ్రామానికి చెందిన యలమంచిలి రష్మి, హైదరాబాద్‌కు చెందిన చమళ్లమూడి సాయికృష్ణకు నాలుగునెలల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో రూ.30 లక్షల కట్నం, రూ.40లక్షల విలువైన ఏడువారాల నగలు, భర్తకు రూ.12 లక్షల విలువైన ఆభరణాలు ఇచ్చారు. వివాహానంతరం హైదరాబాద్ కాపురానికి వెళ్లారు. మొదటి రాత్రి నుంచే రష్మిపై దాడి ప్రారంభించాడు. తనకు బీఎండబ్ల్యూ కారు, అదనంగా మరో ముప్పై లక్షల డబ్బు తేవాలని, లేని పక్షంలో తన ఇంటికి వెళ్లిపోవాలని డిమాండ్ చేసేవాడు.

వివాహమైన పది రోజుల తర్వాత చెప్పా పెట్టకుండా అతను అమెరికా వెళ్లిపోయాడు. తాను ఫోన్ చేస్తే వేరే వాళ్లు ఎత్తి జీరోడే అని అబద్ధం చెప్పించే వాడు. దీంతో విసిగిపోయిన రష్మి పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

వైసీపీ నీచ రాజకీయాలు

● టీడీపీ సీనియర్ నాయకుడు హరికృష్ణ

కంకిపాడు, ఫిబ్రవరి 8: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో విచ్చలవిడిగా పోస్టింగ్‌లు పెడుతూ వైసీపీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందని టీడీపీ సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందన్నారు.

ఇటువంటి పోస్టింగ్‌లు పెడుతున్న వారిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు. పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, ఏనుగ జయప్రకాష్, షేక్ బాజి సమావేశంలో పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ దాడులు

పెదపారుపూడి : విద్యుత్ విజిలెన్స్ అధికారులు గురువారం మండలంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఈ ఆల్ఫ్రాన్స్, ఈఈ కె.వెంకటేశ్వర్లు, గుడివాడ ఈఈ టి.రామకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు 45 బృందాలుగా ఏర్పడి 3059 గృహ సర్వీసులు, 62 వాణిజ్య సర్వీసులను తనిఖీ చేశారు. 206 సర్వీసులకు అదనపు లోడు గుర్తించి రూ.5,46,000 జరిమానా విధించారు విద్యుత్ చౌర్యం జరిగినట్లయితే 9440612086, 9440817579, 9440814269 నెంబర్లకు సమాచారం ఇవాల్సిందిగా కోరారు. తనిఖీల్లో గుడివాడ రూరల్ ఏడీఈ కె.దశరత్, పెదపారుపూడి ఏఈ ఎస్.ఎ.ఎస్.వరకుమార్, డివిజన్ పరిధిలోని ఏడీఈలు, ఏఈలు, జేఈలు, లైన్ ఇన్స్‌పెక్టర్లు, లైన్‌మెన్స్, విద్యుత్ విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.



ఫొటోగ్రాఫర్ ఓంప్రకాష్‌కు సత్కారం

మచిలీపట్నం టౌన్ : ఫొటోగ్రాఫర్ పోతన ఓం ప్రకాష్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డును అందుకోవడం ముదావహమని నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు అన్నారు. ఇండియన్ బుక్ ఆఫ్ అవార్డును అందుకున్న ఓం ప్రకాష్‌ను గురువారం సాయంత్రం మచిలీపట్నం డివిజన్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఫోటోగ్రాఫర్ల సంఘం న్యాయ సలహాదారు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, ఓం ప్రకాష్ గిన్నీస్ బుక్ ఆఫ్ అవార్డుకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఫోటోగ్రాఫర్ల సంఘ అధ్యక్షుడు చిలంకుర్తి శేషు, కార్యదర్శి అనంత్, గౌరవాధ్యక్షుడు కోకా సత్యనారాయణ, మాదిరెడ్డి అంజిబాబు, మరకాని వాసు, పంచకర్ల వాసు తదితరులు ప్రకాష్‌ను సత్కరించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	136, 145, 156
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.46

ఏఎస్పీగా వెంకటేశ్వరరావు



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 8 : జిల్లా అడిషనల్‌గా ఎస్పీగా జి.వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాజమండ్రిలో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చారు. జిల్లా ఎస్పీ నయాం అజ్మీని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు.

కూచిపూడి ఎస్సైగా శ్రీనివాస్

కూచిపూడి : కూచిపూడి ఎస్సైగా టి.శ్రీనివాస్ గురువారం బాధ్యతలు చేపట్టారు. మచిలీపట్నం వీఆర్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పని చేసిన ఎస్సై సందీప్ కంకిపాడు బదిలీ అయ్యారు.

చల్లపల్లిని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతాం



స్వచ్ఛ చల్లపల్లి రథసారథులతో మాట్లాడుతున్న ప్రముఖ పర్యావరణవేత్త శ్రీనివాసన్

చల్లపల్లి, ఫిబ్రవరి 8 : చల్లపల్లిని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించి శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రముఖ పర్యావరణ వేత్త వేలేరు శ్రీనివాసన్ పేర్కొన్నారు. చల్లపల్లి గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించి డంపింగ్ యార్డు, సుందరీకరించిన ప్రదేశాలను పరిశీలించారు. గ్రామంలోని అన్ని వార్డులు పరిశీలించి ప్రణాళిక రూపొందిస్తానన్నారు. డంపింగ్ యార్డులో పొడి చెత్తను సంపదగా మార్చే అంశంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాల విభజన ప్రక్రియపై శిక్షణ ఇస్తానన్నారు. స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తల శ్రమకు తన సలహాలు తోడైతే గ్రామం ఆదర్శనీయంగా నిలుస్తుందన్నారు. సర్పంచ్ కృష్ణకుమారి మాట్లాడుతూ మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ కాకి మాధవరావు సహకారంతో ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడును కలిసినట్లు తెలిపారు. శ్రీనివాసన్ సలహాలు, సహకారంతో చల్లపల్లి మోడల్ విలేజ్‌గా మార్చేందుకు పాలకవర్గం, డాక్టర్ డి.ఆర్.కే.ప్రసాద్ దంపతులు, స్వచ్ఛ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు.

భూహక్కు చట్టం రద్దు కోరుతూ న్యాయదేవత విగ్రహానికి పాలాభిషేకం



మచిలీపట్నం టౌన్ : నూతన భూ హక్కు చట్టం రద్దు కావాలంటూ న్యాయదేవత విగ్రహానికి న్యాయవాదులు, న్యాయవాద గుమాస్తాలు పాలాభిషేకం చేశారు. ప్లకార్డులతో నినాదాలు చేశారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తుంగల హరిబాబు, ప్రధాన కార్యదర్శి కొట్టె రఘురాం, గుమాస్తాల సంఘం నాయకులు పి.వి. ఫణికుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి చీకటి చట్టాన్ని రద్దు చేయాలన్నారు. న్యాయవాదులు బూరగడ్డ అశోక్ కుమార్, బి. పోతురాజు, భాగ్యరాజు, కొండయ్య, జి.వి.ఎల్. నరసింహారావు, టి. సత్యనారాయణ, శంకర్, పుప్పాల ప్రసాద్, మాదివాడ వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



గంగాధరపురంలో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో వెనిగండ్ల, రావి



అవనిగడ్డ మూడో వార్డులో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో మండలి వెంకట్రామ్



చల్లపల్లి పడమర వీధిలో కరపత్రాలందజేస్తున్న టీడీపీ నాయకులు

జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టండి

● బాబు ష్యూరిటీ కార్యక్రమంలో వెనిగండ్ల, రావి పిలుపు

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 8 : వైసీపీ ప్రభుత్వానికి కాలం చెల్లిందని గుడివాడ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము అన్నారు. చిన ఎరుకపాడు, గంగాధరపురం గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. చిన ఎరుకపాడుకు చెందిన కల్లు గీత కార్మిక నాయకుడు గోపర్తి బోడిబాబు తన అనుచరులతో కలిసి టీడీపీ చేరారు. వెనిగడ్ల, రావి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీసీలకు జగన్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్‌పర్సన్ శాయన పుష్పవతి, మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ, నాయకులు గొర్తి సత్యనారాయణ, లింగం ప్రసాద్, బండ్ల వెంకన్న, సురేంద్ర, గాంధీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వెనిగండ్ల సాయంతో డొంక బాగుచేత

గుడ్లవల్లేరు : అంగలూరు గ్రామంలోని చెరకుపల్లి డొంక అధ్వానంగా తయారైంది. గుడివాడ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము గ్రామంలో పర్యటించిన సందర్భంగా ఆయన దృష్టికి తీసుకువెళ్లగా గురువారం సొంత ఎక్స్‌కవేటర్‌తో దానిని బాగు చేయించారు. శ్యామల రాజు, ధనకోటేశ్వరరావు,మేకా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి : వెంకట్రామ్

అవనిగడ్డ : చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం బాగుపడుతుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ అన్నారు. అవనిగడ్డ మూడో వార్డులో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం గురువారం జరిగింది. వెంకట్రామ్, టీడీపీ, జనసేన నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేశారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **చల్లపల్లి :** మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం చల్లపల్లి పడమర వీధి 73వ బూత్ పరిధిలో నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు మోర్ల రాంబాబు, ఎంపీపీ కోట విజయ రాధిక, కృష్ణా జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షులు మోర్ల శివ, పట్టణ అధ్యక్షులు షేక్ నబీ గోరి, రావి రాజు, రావి చిట్టి, జనసేన వార్డు మెంబర్ కంతేటి నళిని, బూత్ ఇంచార్జ్ ఎడ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు. **ఘంటసాల :** మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు, సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నాల్గోరోజు కుమార్‌రాజా పల్లెబాట



పామర్రు : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజల సమస్యల పరిష్కారం టీడీపీకే సాధ్యమని పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్ రాజా అన్నారు. పల్లెబాట పాదయాత్ర గురువారం నాల్గోరోజు చాట్లవానిపురం, చెన్నువానిపురం, బాహుజీపేటలో జరిగింది. ఆయా కాలనీల్లో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ కుమార్‌రాజా ముందుకు సాగారు. ప్రజలు జగన్ ప్రభుత్వ వైఫల్యాలను కుమార్‌రాజాకు ఏకరువుపెట్టారు. కరెంటు బిల్లులు కట్టలేనంత భారంగా మారాయని వాపోయారు. మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, మంతెన రామాంజనేయులు, గొట్టిపాటి లక్ష్మీదాసు, వల్లూరిపల్లి గణేష్, కోటి పాండురంగారావు వీరంకి వెంకటేశ్వరరావు, రంగారెడ్డి, సుబ్రమణ్యం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఆశా వర్కర్లు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 8 : తమ సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న ఆశ వర్కర్లు, సీఐటీయూను నాయకులను గురువారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఇల్లు దాటి కదలవద్దంటూ నోటీసులు జారీ చేశారు. సీఐటీయూ నాయకులు సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడుతూ, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. **పెడన :** ఆందోళనలో పాల్గొనేందుకు వెళుతున్న 26 మంది ఆశ వర్కర్లను గురువారం పోలీసులు అరెస్టు చేసి పట్టణంలోని వాసవీ ప్రార్థనా మందిరంలో నిర్బంధించి, సాయంత్రం అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో ఆశా వర్కర్లు స్వర్ణకుమారి, బేస్ లక్ష్మీ, నున్న విశాలక్షి, షకీలా ఉన్నారు. **గుడివాడ రూరల్ :** చలో విజయవాడకు వెళ్లకుండా 18 మంది ఆశా వర్కర్లను గురువారం పోలీసులు అడ్డుకుని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, సాయంత్రం వదిలివేశారు. **గుడ్లవల్లేరు :** చలో విజయవాడ ఆందోళనకు వెళుతున్న ఆశా వర్కర్లు ఇందిర, వరలక్ష్మి, మండల కె.వి.పి.ఎస్ అధ్యక్షురాలు మేకల ఏసురత్నం తదితరులను పోలీసులు అరెస్టు చేసి గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆశా వర్కర్లు ధర్నా చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. పిల్లి జయలక్ష్మి, బి.కోటేశ్వరరావు,



పెడనలో పోలీసుల నిర్బంధంలో ఆశా వర్కర్లు

ఎం.జగన్,చందన లక్ష్మి, గోపాల్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. **కూచిపూడి :** మొవ్వ మండలంలోని ఆశా వర్కర్లను కూచిపూడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. **కోడూరు :** చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న ఆశా వర్కర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న రైతు సంఘ నాయకులు ఆవుల బసవయ్య పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి వారిని పరామర్శించి తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజల స్వేచ్ఛను హరిస్తుందని విమర్శించారు. **అవనిగడ్డ రూరల్ :** ఆశా వర్కర్లు చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సీఐ త్రినాథ్, ఎస్సై రమేష్ ఉదయం 11 గంటల వరకు ఆశా వర్కర్లు ఎవ్వరు విజయవాడకు వెళ్లకుంగా అడ్డుకున్నారు.

పోలీసులకు యోగా శిక్షణ



మచిలీపట్నం టౌన్ : యోగా సాధన వల్ల మానసిక ఒత్తిడి నుంచి పోలీసులు దూరం కావచ్చని ఏఆర్ ఏఎస్పీ ప్రసాద్ అన్నారు. పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో 15 రోజుల పాటు నిర్వహించే యోగా శిక్షణా తరగతులను ఏఆర్ ఏఎస్పీ గురువారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ యోగసభ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగ శిక్షణా తరగతులను యోగా గురువులు ఘంటసాల గురునాథబాబు, రమేష్ నిర్వహించారు. ప్రాణాయామం, సూర్య నమస్కారాలు నేర్పించారు. గురునాథబాబు మాట్లాడుతూ, రథసప్తమి సందర్భంగా హిందూ కళాశాల ప్రాంగణంలో 1000 మంది విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయిస్తున్నామన్నారు.

ఫొటోగ్రాఫర్ ఓంప్రకాష్‌కు సత్కారం



మచిలీపట్నం టౌన్ : ఫొటోగ్రాఫర్ పోతన ఓం ప్రకాష్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డును అందుకోవడం ముదావహమని నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు అన్నారు. ఇండియన్ బుక్ ఆఫ్ అవార్డును అందుకున్న ఓం ప్రకాష్‌ను గురువారం సాయంత్రం మచిలీపట్నం డివిజన్ ఫోటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఫోటోగ్రాఫర్ల సంఘం న్యాయ సలహాదారు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, ఓం ప్రకాష్ గిన్నీస్ బుక్ ఆఫ్ అవార్డుకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఫోటోగ్రాఫర్ల సంఘ అధ్యక్షుడు చిలంకుర్తి శేషు, కార్యదర్శి అనంత్, గౌరవాధ్యక్షుడు కోకా సత్యనారాయణ, మాదిరెడ్డి అంజిబాబు, మరకాని వాసు, పంచకర్ల వాసు తదితరులు ఓం ప్రకాష్‌ను సత్కరించారు.

ఘనంగా విద్యావికాస్ ఫేర్‌వెల్ డే



గుడివాడ : విద్యావికాస్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే గురువారం ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డైరెక్టర్లు ముప్పాళ్ళ సుబ్బారావు, కొమ్మినేని సాంబశివరావు మాట్లాడుతూ ఎంత స్థాయికి వెళ్లినా అక్షర జ్ఞానాన్ని అందించిన గురువులను, పాఠశాలను గుర్తు పెట్టుకోవాలన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యులు వైసిపి ప్రసాద్, మాజీ ప్రిన్సిపాల్ గుండపనేని సాంబశివరావు, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకోవాలి : జనసేన

మచిలీపట్నం టౌన్ : ఎంపీ వల్లభనేని బాలశౌరి సాయంతో గెలుపొందిన పేర్ని నాని ఆయనను ఇష్టారాజ్యంగా విమర్శించడం అర్ధరహితమని జనసేన నేత మాదివాడ రాము ధ్వజమెత్తారు. జనసేన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నుంచి వైసీపీలోకి వచ్చిన పేర్ని నాని పార్టీల మార్పిడిపై విమర్శించడం సరికాదన్నారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు జనసేన నాయకులు పినిశెట్టి వేణు, కోసూరు లక్ష్మీనాంచారయ్య, కొట్టె వెంకట్రావు తదితరులు వైసీపీ విమర్శలను ఖండించారు.

విద్యుత్ విజిలెన్స్ దాడులు

పెదపారుపూడి : విద్యుత్ విజిలెన్స్ అధికారులు గురువారం మండలంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్‌ఈ ఆల్ఫ్రెన్స్, ఈఈ కె.వెంకటేశ్వర్లు, గుడివాడ ఈఈ టి.రామకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు 45 బృందాలుగా ఏర్పడి 3059 గృహ సర్వీసులు, 62 వాణిజ్య సర్వీసులను తనిఖీ చేశారు. 206 సర్వీసులకు అదనపు లోడు గుర్తించి రూ.5,46,000 జరిమానా విధించారు విద్యుత్ చౌర్యం జరిగినట్లయితే 9440612086, 9440817579, 9440814269 నెంబర్లకు సమాచారం ఇవాల్సిందిగా కోరారు. తనిఖీల్లో గుడివాడ రూరల్ ఏడీఈ కె.దశరత్, పెదపారుపూడి ఏఈ ఎస్.ఏ.ఎస్.వరకుమార్, డివిజన్ పరిధిలోని ఏడీఈలు, ఏఈలు, జేఈలు, లైన్ ఇన్స్పెక్టర్లు, లైన్‌మెన్స్, విద్యుత్ విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

పట్టాభి భవనానికి ఎన్‌వోసీ ఇవ్వాలి

మచిలీపట్నం టౌన్ : పట్టాభి స్మారక భవనం నిర్మాణానికి అధికారుల ఉత్తర్వులతో సహా వినతి పత్రాలు ఇచ్చామని, కౌన్సిల్ సమావేశంలో ఎన్‌వోసీ ఇవ్వాలని కోరామని పట్టాభి స్మారక భవన నిర్మాణ సాధన కమిటీ సభ్యులు తెలిపారు. న్యాయవాది పుప్పాల ప్రసాద్, పి.వి.ఫణికుమార్, మాదివాడ వెంకట నరసింహారావు, ధూళిపాళ శ్రీరామచంద్రరావు, కెవిరామారావు మాట్లాడుతూ, మేయర్‌ను కలసి వినతి పత్రం ఇచ్చినా, తనకు ఏ విధమైన వినతిపత్రం ఇవ్వలేదని చెప్పడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం, కలెక్టరు ఇచ్చిన ఉత్తరువులను గౌరవించి పట్టాభి స్మారక భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని డిమాం డ్ చేశారు.

రసాయనశాస్త్ర పరిశోధనల్లో నూతన ఆవిష్కరణలు

మచిలీపట్నం టౌన్ : విద్యార్థులు రసాయన శాస్త్ర పరిశోధనల్లో నూతన ఆవిష్కరణలు చేయాలని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగాధిపతి సి. సురేష్‌రెడ్డి అన్నారు. కృష్ణా వర్సిటీలో గురువారం సురేష్‌రెడ్డి అతిథో పన్యాసం ఇచ్చారు. డీన్ ప్రొఫెసర్ ఎం.వి.బసవేశ్వరరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ వై.సుందరకృష్ణ, కెమిస్ట్రీ విభాగాధిపతి డి.రామశేఖరరెడ్డి పాల్గొన్నారు.

మంత్రి బొత్సను కలిసిన అప్సా నాయకులు

పెడన : ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) నాయకులు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణను కలసి ప్రైవేటు విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. అప్సా జిల్లా అధ్యక్షుడు అనుమకొండ గౌరీప్రసాద్, రాష్ట్ర నాయకులు వి. సుందరరాం, కొమరగిరి చంద్రశేఖర్, కె. తులసీప్రసాద్, ఎం.బి.ఆర్. శర్మ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

మృతుని కటుంబానికి మండలి పరామర్శ

కోడూరు : మాచవరంలో పాముకాటుకు గురై మృతి చెందిన అప్పికట్ల రఘురాం కుటుంబసభ్యులను మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ గురువారం పరామర్శించారు. రఘురాం కుటుంబసభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు కూరాకుల శివయ్య, కూరాకుల చంద్రశేఖర్, సిర్విశెట్టి రమేష్, అప్పికట్ల కృష్ణబాబు, చంటి, వాసు పాల్గొన్నారు.

నరసింహాపురం - నారేపాలెం రహదారి అభివృద్ధి చేస్తా

కోడూరు : నరసింహాపురం - నారేపాలెం రహదారిని అభివృద్ధి పరుస్తామని జనసేన నియోజకవర్గ నాయకులు మాదివాడ వెంకట కృష్ణ (బ్రదర్ క్రిస్టియన్) తెలిపారు. మండల జనసేన నాయకులు మర్రే గంగయ్య పిలుపు మేరకు నారేపాలెం రహదారిని పరిశీలించారు. నారేపాలెం రహదారికిరువైపులా ఉన్న ముళ్ల చెట్లను తొలగిస్తానని, రహదారిని చదును చేయిస్తానని హామీ ఇచ్చారు.

పురుగు మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

పామర్రు : జమీదగ్గుమిల్లి గ్రామానికి చెందిన కూడేటి వెంకటేశ్వరరావు (68) భార్య చనిపోయిన బెంగతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు పామర్రు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ మృతదేహన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సై పైడిబాబుకు సత్కారం

బంటుమిల్లి : బదిలీపై వెళ్తున్న ఎస్సై పైడిబాబును పలువురు ప్రముఖులు, అధికారులు, సిబ్బంది బుధవారం రాత్రి ఘనంతా సత్కరించి వీడ్కోలు పలికారు. ఆయన సేవలను కొనియాడురు. ఎస్సై పి.వాసు తదితరులు పాల్గొన్నారు.